క్లుప్తంగా

అసంపూర్తిగా గుంటూరు ఛానల్ మరమ్మతు పనులు



పెదకాకాని: నిత్యం లక్షల మందికి మంచినీరు, వేల ఎకరాలకు సాగునీరు అందించే గుంటూరు ఛానల్(కొత్త కాలువ)లో గుర్రపు డెక్క తొలగింపు, కాలువ గట్ల మరమ్మతుల పనులు అసంపూర్తిగా జరుగుతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. రైతులతో కలిసి గురువారం గుంటూరు ఛానల్‌ను ఆయన పరిశీలించారు. శివాజీ మాట్లాడుతూ.. గుర్రపు డెక్క పూర్తిగా తొలగించకుండా దానిపై నీటి సంఘాల ప్రతినిధులు గడ్డి మందు పిచికారీ చేశారన్నారు. దీంతో నీళ్లు విషపూరితంగా మారాయని.. ఈ నీరు తాడేపల్లి మండలం సీతానగరం నుంచి వట్టిచెరుకూరు మండలం వరకు గుంటూరు, చుట్టుపక్కల 44 గ్రామాలకు తాగడానికి సరఫరా అవుతుందన్నారు. ప్రజలు ఇలాంటి కలుషితమైన నీరు తాగితే అనారోగ్యానికి గురవుతారని, చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు సంకూరి నీలాంబరం, రైతులు వీర్ల వీరాంజనేయులు, డి.వినోద్, డి.బాబు, భవానీశంకర్, జి.నాగరాజు, ఎస్ గోపి, డి.సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎం బాధ్యతలు స్వీకరణ



పొన్నూరు: పొన్నూరు ఆర్టీసీ డిపో మేనేజరుగా ఎల్.వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి డిపో మేనేజరుగా బాధ్యతలు నిర్వహించిన ఆయన బదిలీపై పొన్నూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిపో పరిధిలో ఆర్టీసీ ఆదాయం పెంచడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తానని అన్నారు. ఇక్కడ పనిచేసిన అజిత కుమారి పల్నాడు జిల్లా డీపీటీఓగా బదిలీపై వెళ్లారు.

ఆధార్ నవీకరణకు మరో అవకాశం

15 నుంచి 25వ తేదీ వరకు శిబిరాలు

పొన్నూరు: పొన్నూరు పట్టణంలో ఈ నెల 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15, 16 తేదీలలో 13వ సచివాలయం, 25వ వార్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, క్యాబిన్‌పేట సచివాలయం.. 17, 18 తేదీలలో శ్రీరామ మున్సిపల్ స్కూల్, నాగుల చెరువు సచివాలయం, 13వ సచివాలయం.. తిరిగి 22, 23వ తేదీలలో వార్డు అంగన్‌వాడీ స్కూల్, 9 వార్డు మున్సిపల్ స్కూల్, 9వ సచివాలయం.. 24, 25 తేదీలలో 14 వార్డు మున్సిపల్ స్కూల్, 26 వార్డు ఎంపీపీ స్కూల్, 9వ సచివాలయంలో ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

రేషన్ దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు



ప్రత్తిపాడు: పెదనందిపాడు మండలం కొప్పర్రులోని ఒకటో నంబరు చౌక ధరల దుకాణంలో గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణంలోని స్టాక్ రిజిస్టర్లు, రేషన్ నిల్వలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లలో ఉన్న లెక్కలకు భిన్నంగా దుకాణంలో అదనంగా 1,800 కేజీల రేషన్ బియ్యం (36 బస్తాలు) ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు రేషన్ డీలర్‌పై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న స్టాక్‌ను అదే గ్రామంలో ఉన్న మరో డీలర్‌కు అప్పగించారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్, పౌరసరఫరాలశాఖ డీటీ శివశంకర్, అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ రథం వాహనం ప్రారంభం




ప్రత్తిపాడు: చెత్త నుంచి సంపద సృష్టించుకోవచ్చని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. గుంటూరు రూరల్ మండలం లాల్‌పురంలో చెత్త సేకరణకు స్వచ్ఛ రథం వాహనాన్ని గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వచ్ఛ రథానికి ప్రజలంతా సహకరించాలని, చెత్త ద్వారా సంపద సృష్టించుకుని గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, జిల్లా పంచాయతీ అధికారి నాగసాయి కుమార్, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వలస బతుకులకు పోషణ్ కష్టాలు

ఇక్కడ కనిపిస్తున్న ఈమె పేరు గీతాంజలి నాయక్.. ఒరిస్సా రాష్ట్రంలోని బద్రక్ గ్రామం. నడింపాలెంలోని ఓ స్పిన్నింగ్ మిల్లులో పనిచేసుకుంటూ ఇక్కడే ఉంటున్నారు. రెక్కాడితే గానీ డొక్క నిండని పేదలు. ప్రభుత్వం నెల నెలా ఇచ్చే పోషకాహారం కొంత ఆ కుటుంబానికి ఉపయుక్తంగా ఉంటుంది. ప్రస్తుతం ఈమె తొమ్మిదో నెల గర్భిణి. ప్రభుత్వం అందించే సరుకుల కోసం నడింపాలెం సాయిప్రభు కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చారు. ఫొటో క్యాప్చర్ అవ్వక మధ్యాహ్నం వరకు కేంద్రంలోనే కూర్చుండిపోయింది. అంగన్‌వాడీ కార్యకర్త ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలితం లేదు. ఫొటో క్యాప్చర్ సక్సెస్ అవ్వలేదు. ఎర్రర్ రావడంతో సరుకులు ఇవ్వడానికి వీలుపడలేదు.



ఫేస్ రికగ్నిషన్‌తో కుస్తీలు పడుతున్న అంగన్‌వాడీ కార్యకర్త



ప్రక్రియ పూర్తి చేసిన తరువాత వస్తున్న ఎర్రర్

- పోషణ్ ట్రాకర్ యాప్‌తో వలస వచ్చిన గర్భిణులు, బాలింతలకు అందని పోషకాహారం
- ప్రత్యామ్నాయం చూపని ప్రభుత్వం

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పారదర్శకత పేరుతో ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన నూతన విధానం వలస బతుకుల డొక్కలు ఎండేలా చేస్తోంది. ముఖ ఆధారిత గుర్తింపుతో గర్భిణులు, బాలింతలు చిన్నారులకు, పోషకాహారం అందించేందుకు జూలై ఒకటి నుంచి పోషణ్ ట్రాకర్ యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా అంగన్‌వాడీలు తమ కేంద్రాల పరిధిలో నమోదైన లబ్ధిదారులకు ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా మాత్రమే పోషకాహారం అందించాల్సి ఉంది.

యాప్‌లతో నానా తిప్పలు..

అంగన్‌వాడీలు లబ్ధిదారులకు టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్) ఇవ్వాలి అంటే కచ్చితంగా పోషణ్ ట్రాకర్ యాప్, బాల సంజీవని యాప్ 2.0 ల్లో వేర్వేరుగా లాగిన్ అయ్యి, ఆధార్ నంబర్, మొబైల్ నెంబర్, ఓటీపీ, ముఖ ఆధారిత గుర్తింపును నిర్ధారించుకోవాల్సి ఉంది. అన్ని దశల్లో సక్సెస్ అయ్యి కేవైసీ పూర్తి అయితేనే అంగన్‌వాడీలు గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలి. అయితే బాల సంజీవని యాప్ సక్రమంగానే పని చేస్తున్నప్పటికీ పోషణ్ ట్రాకర్ యాప్ మాత్రం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది.

పోషణ్ యాప్‌తో తప్పని అవస్థలు..

ప్రత్తిపాడు మండలంలోని 16 నంబరు జాతీయ రహదారిపై ఉన్న యనమదల, ఈదులపాలెం, నడింపాలెం, తుమ్మలపాలెం, పార్వతీపురం గ్రామాల్లో అనేక స్పిన్నింగ్ మిల్లులు, క్రషర్లు, పౌల్ట్రీ ఫాంలు, కంపెనీలు ఉన్నాయి. వీటిలో కూలి పనులు చేసుకునేందుకు బీహార్, ఒరిస్సా, కర్ణాటక రాష్ట్రాలతో పాటు, ఏపీలోని పార్వతీపురం, మన్యం, వంటి గిరిజన ప్రాంతాల నుంచి ఎప్పుడో ఏళ్ల తరబడి పొట్టకూటి కోసం వలస వచ్చి ఇక్కడే జీవిస్తున్న కుటుంబాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోషణ్ ట్రాకర్ యాప్‌తో ఇతర రాష్ట్రాలు, ఏపీలోని ఇతర జిల్లాల నుంచి వలస వచ్చిన మహిళలు (గర్భిణులు, బాలింతలు) పోషకాహారం తీసుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నిండు గర్భిణులు, బాలింతలు గత పది రోజులుగా పోషకాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

సమస్యను సీడీపీవో జి.విజయలక్ష్మి వద్ద 'సాక్షి' ప్రస్తావించగా 'సమస్యలున్న వారిని మాకు తెలియజేమని చెప్పాం.. వారికి టెక్నికల్ సపోర్ట్ ఇస్తాం.. అందరినీ ఒకే రోజు కేంద్రానికి పిలిచి ఇబ్బంది పెట్టవద్దని చెప్పామని' చెప్పారు.

తెల్లవారుజామున వచ్చాం..



పోషకాహారం కోసం తెల్లవారుజామున సెంటర్ వద్దకు వచ్చాను. కానీ అన్నీ పూర్తి చేసినా లాస్ట్‌లో సర్వర్ పోతుంది. మళ్లీ మొదటికి వస్తుంది. ఫొటో మ్యాచ్ అయితేనే సరుకులు ఇస్తామంటున్నారు. నా ఆధార్‌లో ఫొటోకు ఇప్పటి ఫొటోకు మ్యాచ్ అవ్వడం లేదని యాప్లో చూపిస్తుంది. అందుకని సరుకులు తీసుకునేందుకు వీలు అవ్వడంలేదు.

– ఆర్.అనూరాధ (బాలింత, శ్రీకాకుళం జిల్లా)

మూడో తారీకు నుంచి తిరుగుతున్నా..



సరుకుల కోసం మూడో తారీకు నుంచి తిరుగుతున్నాను. కానీ ఫొటోలు మ్యాచ్ కాకపోవడంతో సరుకులు ఇవ్వడంలేదు. ఎప్పుడు వచ్చినా ఫొటో తియ్యడానికి రావడం లేదని చెబుతున్నారు. వస్తే సరుకులు తీసుకుంటాం. పలు మార్లు సర్వర్ సమస్య కూడా వేధిస్తోంది.

– ఆర్.స్వప్న (గర్భిణి, పార్వతీపురం, మన్యం జిల్లా)

మెగా పేరెంట్స్‌డేలో విన్నవించిన సమస్యలు



మాట్లాడుతున్న ఎస్ఎంసీ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారాయణ



హెచ్ఎం పోస్టు భర్తీపై టీడీపీ నాయకులకు విన్నవిస్తున్న హెచ్ఎం ప్రశాంతి

- స్కూల్ సమయానికి ఆర్టీసీ బస్సు నడపాలని వినతి
- హెచ్ఎం పోస్టు భర్తీ చేయించాలని మరో పాఠశాలలో..

ప్రత్తిపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం అట్టహాసంగా నిర్వహించిన మెగా పేరెంట్స్‌డేలో ఒక వైపు తల్లిదండ్రులు, మరో వైపు ఉపాధ్యాయులు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా నిర్వహించిన ఈ మెగా పేరెంట్స్ డేలో సమస్యలే ప్రధాన అజెండాగా నిలిచాయి. ఒక పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌లో పరికరాలు లేవని.. ఇంకొక పాఠశాలలో హెచ్ఎం పోస్ట్ గత కొన్ని నెలలుగా ఖాళీగా ఉందని.. మరో పాఠశాలలో ఇద్దరు పిల్లలున్నా మాకు తల్లికి వందనం పథకం వర్తించలేదని.. ఇలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రకరకాల సమస్యలను పేరెంట్స్ డేలో లేవనెత్తారు.

సభలో సమస్యల ప్రస్తావన..

ప్రత్తిపాడు మండలం చిన్నకొండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారాయణ పాఠశాలలో పిల్లలకు తాగునీటి సౌకర్యం లేక అల్లాడుతున్నారని అన్నారు. పాతమల్లాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొంతకాలంగా ప్రధానోపాధ్యాయుని పోస్ట్ ఖాళీగా ఉందని ఆ పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం ఎస్‌పీఎల్ ప్రశాంతి తెలుగుదేశం నాయకులు, గ్రామస్తులకు విన్నవించారు. తుమ్మలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొండజాగర్లమూడికి చెందిన వాసిమళ్ల మహేంద్ర తన ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం రాకపోవడంపై హెచ్ఎంను ప్రశ్నించారు. యనమదల హెచ్ఈ ప్రాథమిక పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ డేలో ఈదులపాలెం శివారులోని సీఆర్ కాలనీ వాసులు పాఠశాల సమయానికి ఆర్టీసీ బస్సును వేయించాలని హెచ్ఎంను కోరారు. మెగా పేరెంట్స్ డే సమావేశాలు ఆద్యంతం రాజకీయ సభల్లా కనిపించాయి. ఆయా పాఠశాలల్లోని వేదికలపైకి తెలుగుదేశం, జనసేన నాయకులను పిలిచి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ స్వామి భక్తిని చాటుకోవడం గమనార్హం.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు

మంచాల(చేబ్రోలు): గ్రామీణ ప్రాంత ప్రజల కోసం యూనియన్ బ్యాంక్ అందిస్తున్న వివిధ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని చేబ్రోలు యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి.వెంకటేశ్వర్లు అన్నారు. చేబ్రోలు మండలం మంచాల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో అవార్డు స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో జన సురక్ష ప్రోగ్రాం నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి సురక్ష బీమా పథకాల గురించి అవగాహన కల్పించారు. చేబ్రోలులో నూతనంగా యూనియన్ బ్యాంక్ శాఖను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు రమేష్, రత్నకుమారి, రవికుమార్, యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, అవార్డ్స్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురు పూర్ణిమ



సాయిమందిర్ వద్ద గోపూజ





వేడుకల్లో పాల్గొన్న భక్తులు

- భక్తులతో కిటకిటలాడిన సాయి మందిరాలు
- గురువులకు మోకరిల్లిన శిష్యులు



పెదకాకాని వైజంక్షన్‌లోని సాయినాథుడు

ప్రత్తిపాడు: గురుపౌర్ణమి సందర్భంగా సాయి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆలయాల్లో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెంలోని సాయిబాబా దేవాలయంలో భక్తులు పూజలు చేశారు. గొట్టిపాడు శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని సాయినాథునికి, గుంటూరురూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామంలోని శ్రీ అభయ సిద్ధి సాయిరామ్ సేవా మందిరంలో గురు పూజా కార్యక్రమాలను వైభవోపేతంగా జరిపారు. పెదనందిపాడులోని సాయిమందిర్‌లో గురుపౌర్ణమి సందర్భంగా గోపూజ నిర్వహించారు. ప్రాడిజీ పాఠశాలలో గురువారం స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావు గురుపౌర్ణిమ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ సూర్యకుమారి, ప్రిన్సిపాల్ రధిని చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొన్నూరు: పట్టణంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ వీరాంజనేయ యోగ సాధన సేవా సంఘంలో గురుపౌర్ణిమ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి పొట్టూరి సత్య శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంఘ శిష్యబృందం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షులు, యోగాచార్య శెట్టి సుబ్రహ్మణ్యంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆకుల సాంబశివరావు, దమ్మాల వెంకటేశ్వర్లు, ఖాజా, సురేష్, కరుణశ్రీ, సుధారాణి పాల్గొన్నారు.

పెదకాకాని: గురుపౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని సాయిబాబాకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండలంలోని పెదకాకాని, నంబూరు, వెనిగండ్ల, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు గ్రామాలలోని సాయిబాబా మందిరాలను గురువారం శోభాయమానంగా అలంకరించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వెనిగండ్ల జనచైతన్యనగర్ సాయిబాబా మందిరం అర్చకులు కూరపాటి శివప్రసాద్, గణేష్‌సాయి మందిరం అర్చకులు సుధీర్‌శర్మ, పలు ఆలయాల్లో అర్చకులు పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



యోగాచార్యను సన్మానిస్తున్న శిష్యబృందం



గురుపౌర్ణమి వేడుకలలో భక్తులు

ఘనంగా మెగా పేరెంట్స్ డే



నంబూరు వివా ది స్కూల్‌లో సాంస్కృతిక కార్యమాల్లో చిన్నారులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో గురువారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ.. విజ్ఞాన్ యూనివర్సిటీ పంచసూత్రాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, సీఈవో మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, డీన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ లావు రత్తయ్య



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ

చేబ్రోలు: చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పేరెంట్స్ డే సమావేశంలో తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సుచరిత, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎం.ఏడుకొండలు పాల్గొన్నారు.

పెదకాకాని: మెగా పేరెంట్స్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పెదకాకాని గీతాంజలి విద్యాలయంలో విద్యార్థులతో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ మునగా శ్రీహరి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చేబ్రోలు: విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటి సాధన కోసం కృషి చేయాలని ప్రెసిడెన్సీ హైస్కూల్ డైరెక్టర్ వి.బస్‌బాబు అన్నారు. చేబ్రోలులోని ప్రెసిడెన్సీ హైస్కూల్‌లో గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరిగింది.

ప్రత్తిపాడు: పచ్చని మొక్కలతో భారతావని ఆహ్లాదంగా సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ప్రత్తిపాడు అక్షయ స్కూల్ విద్యార్థులు కరెస్పాండెంట్ వెలగా శ్రీవల్లి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ఇండియా ఆకృతిలో కూర్చుని మొక్కలను ప్రదర్శించారు. మెగా పేరెంట్స్‌డే, గురు పౌర్ణమి సందర్భంగా సుమారు 400 మొక్కలను విద్యార్థులకు, తల్లిదండ్రులకు, గ్రామస్తులకు అందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదకాకాని: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం వివా ది స్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సందడిగా సాగింది. మండలంలోని నంబూరు వివా ది స్కూల్‌లో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు చిన్నారులతో సరదాగా ఆడిపాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సెంటర్ స్టేజ్ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. సాంస్కృతిక నృత్యాలు, గీతాలు తల్లిదండ్రులను అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ ఎలి కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, పీవైపీ కోర్డినేటర్ ఎ.కె.మాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: పాఠశాల దశలోనే విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని గుంటూరు కార్పొరేషన్ నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. గుంటూరురూరల్ మండలం ఏటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మెగా పేరెంట్స్ డేను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉగ్గిరాల సీతారామయ్య, కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ వాసు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.వాణి, విద్యాకమిటీ చైర్మన్ రోజాకుమారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొన్నూరు: పిల్లల బంగారు భవిష్యత్తు విద్యతోనే సాధ్యమవుతోందని ఎంఈఓ కె.విజయభాస్కర్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించారు. పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా ప్రదర్శన

దుగ్గిరాల: మండలంలోని అన్ని గ్రామాల రైతు సేవా కేంద్రాలలో అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను ప్రదర్శనకు ఉంచామని.. రైతులు ఆ జాబితాలో పేర్లను పరిశీలించుకోవాలని ఏఓ ఆర్.విజయబాబు అన్నారు. దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో గురువారం ఆయన ఆస్మిక తనిఖీ చేశారు. రైతు సేవా కేంద్రంలోని 27 రకాల రిజిష్టర్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కౌలు రైతులకు కౌలు రైతు కార్డులను అందించారు. రైతులు తమ పేర్లు అర్హుల జాబితాలో లేనియెడల ఈ నెల 13వ తారీకు వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

26 నుంచి ఉచిత సాఫ్ట్‌వేర్ కోర్స్‌లో శిక్షణ

తాడేపల్లి రూరల్: ఈనెల 26 నుంచి నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా సాఫ్ట్‌వేర్ కోర్స్ (శాప్ ఎస్‌డీ)లో శిక్షణ ఇవ్వనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఎన్‌టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఏదైనా డిగ్రీ చదివిన విద్యార్థులు, నిరుద్యోగులకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ కోర్సును పూర్తిగా ఉచితంగా అందజేయనున్నామని తెలిపారు. అనుభవం గల అధ్యాపకులతో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రతి శని, ఆదివారాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామని అన్నారు. మంగళగిరిలోని రత్నాల చెరువు వద్ద, తాడేపల్లిలోని డిమార్ట్ వద్ద ఉన్న రామ్‌స్నేహ ఎన్‌క్లేవ్‌లోని మానవ సేవా సంస్థ కార్యాలయాల్లో శిక్షణ ఉంటుందని, వివరాలను 99852 22857, 98482 39369, 98666 34866 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఉచిత క్యాన్సర్ పరీక్షలు



తాడికొండ: బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో గురువారం తుళ్లూరులో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆసుపత్రి సీఈవో కృష్ణయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ వైద్యం చాలా ఖర్చుతో కూడుకున్నదని అన్నారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రికి ప్రతి రోజు 1500 మంది హైదరాబాద్‌కు క్యాన్సర్ చికిత్స నిమిత్తం విచ్చేస్తుంటారని.. పేషెంట్ వెంట ఉండేందుకు ఒక వ్యక్తికి వసతి అవకాశం కూడా ఇస్తున్నామన్నారు. స్థానికంగా మరో ఆసుపత్రి ఏర్పాటు చేసేందుకు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. శుక్రవారం ఎర్రబాలెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం జరగనుందని సీఈవో తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏసీసీ కార్మికుల దీక్షలు

తాడేపల్లి రూరల్: బ్రహ్మనందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు గురువారం నాటికి 219వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, కార్మిక నాయకులు కూరపాటి స్టీవెన్, సాంబయ్య, యెహోషువా, ఆశీర్వాదం ప్రారంభించారు. కార్మికులు పాల్గొన్నారు.